# కూనేశ్వరుడి కబ్బిన అదృష్టం

శ్రీ మా. గోఖలే

రిస్టువాచి టైము చూసుకుంటూ హడావిడిగా అద్దెకొంపకు తాళంవేసి కాలేజీకి బయల్దేరిన రంగారావు, మేడమెట్లు దిగేందుకు అట్లా కాలు మోపాడో లేదో — కిందనుండి మేడమెట్లెగ బాక్కుంటూ రొప్పుతూ పైకొస్తున్న కూనేశ్వరుణ్ణి చూసి, మెట్టుమీద కాలుపెట్టినవాడు పెట్టినట్టే నుంచుని పోయ్యాడు.

'నువు - నువు - వుండవనుకున్నా'— అంటూ రంగారావును తోసుకుంటూ ఎగరొప్పుతో ఒక్క క్షణం అట్లాగే నుంచుని—చటుక్కున వరండాలో చతికిలపడ్డాడు కూనేశ్వరుడు, రంగారావు వేపు వింతగా చూస్తూ.

కూనాయ్ ఆ మొహం — అకస్మాత్తుగా వాడొచ్చి ఆ విధంగా చతికిలపడిపోయిన తీరూ నూరుపాళ్లా పరిశీలించిన రంగారావుకు గుండెలో ఏదో చిక్కబట్టి నట్టయింది.

నిన్న టపాలోనే ఉహా కూనేశ్వరుడినుంచి తనకు వుత్తరం వచ్చింది. విమానం పగిలి సముద్రం మధ్యపడినట్టు తనబతుకు బద్దలైందని వాడు రాసిన వుత్తరం యింకా తన టేబిలుమీదే వుంది. వివరాలైతే రాయలేదు కాని జీవితం వాడికో దయ్యంలాగా కనుపిస్తున్నట్టు వాడు అడ్డగోలుగా రాసిం దాన్నిబట్టి తను వూహించ గలిగాడు. అయితే వాడా రాసిన వుత్తరం తనకు పదిరోజుల తరువాతగాని చేరలేదు. ఈ పదిరోజుల్లోనే బాపట్ల తాలూకాలో భయంకరమైన వరద బీభత్సవం జరిగింది. కూనేశ్వరుడిది బాపట్ల దగ్గిర ఒక చిన్న పల్లెటూరు. బాపట్లలో ఓ బాంకులో కాషియరుగా వుద్యోగం చేసుకుంటున్నాడు. బట్టతలపై వడగళ్ల వాన పడ్డట్టు—అంతంత మాత్రంగా వుంటున్న వీడి కుటుంబానికేం ప్రమాదం జరగలేదుగదా! వాడు వరదల్లో నానిన మనిషల్లేనే కనుపించాడు. ఇంకేమాత్రం తాత్సారం చేసినా ఏ క్షణాన కూనాయ్ వెక్కివెక్కి ఏడ్చినా ఆశ్చర్యం లేదు! యింకా నయం! తన భార్య పంకజం యిద్దరు పిల్లల్తో మొన్ననే గూడూర్లో వుంటున్న తన అన్నదగ్గిర కెళ్ళింది! పంకజం అసలే గుండె నీరసం మనిషి!

కూనేశ్వరుణ్ణి జాలిగా లేవదీసి, తలుపు తాళంతీసి సోఫాలో కూచోబెట్టి ఫానువేసి, తను ఎదురు కుర్చీలో కూచుని వాణ్ణి లోతుగా చూశాడు రంగరావు.

'అబ్బ! నాకింకా దడ తగ్గలేదు!' అన్నాడు కూనేశ్వరుడు దీర్ఘంగా శ్వాసవిడుస్తూ.

'ఫరవాలేదు—నువు తొందరపడకు - కొంచెం తాపీగానే మాట్లాడు—' అంటున్న రంగారావుకు యిటీవల తను వింటున్నా, చదువుతున్నా గుండె జబ్బుల వార్తలు మెదళ్ళో గిర్రున తిరిగినై.

'నాకు అప్పుడప్పుడు రక్తపోటు వస్తూ వుంటుంది! నీ కుటుంబం యింట్లో లేనట్టున్నారే?' అన్నాడు కూనేశ్వరుడు గుండెమీద నెమ్మదిగా రాసుకుంటూ.

'పంకజం, పిల్లలు గూడూర్దాకా వెళ్లారు. మరేం ఫరవాలేదు, కొంచెం ఆగుతే పోటు అదే సర్దుకుంటుంది' అని రంగారావంటున్నా నాలుగిళ్లవ

తల వున్న డాక్టర్ని తాను ఎంతతొందరగా వెళ్లి తీసుకువస్తే అంత మేలుంటుందని బుర్రలో తడుతూనేవుంది; కాని రోగిని తను కంగారుపెట్టిన వాడవుతే?

'ఒరేయ్ రంగా, నేను చెప్పేమాటలు నువు నమ్మవు!' అన్నాడు కూనేశ్వరుడు, రంగారావును సూటిగా చూస్తూ.

'నమ్ముతా—చచ్చినట్టు నమ్ముతా— నువు నన్ను నమ్ము!' అని చటుక్కున సమాధానం చెప్పిన రంగారావుకు కూనాయి చూపూ, వాడి మాటల ధోరణిలోనూ విపరీత లక్షణాలేవో వున్నట్టు సందేహం కలిగింది.

'అబ్బ! నీ మేడమెట్లుమండ! యిప్పటి కింకా దడ తగ్గకపోయె!' అన్నాడు కూనేశ్వరుడు.

'అంతేగద! అయితే ఫరవాలేదు! నీ భార్యా బిడ్డలూ, మీవాళ్లంతా బాగున్నారా?' అడిగాడు రంగారావు కూనేశ్వరుణ్ణి పరిశీలిస్తూ.

'ఆ వరద మండిపోను! ఎంతమందిని పొట్టన పెట్టుకుంది! మేం బాపట్లలోనే వుంటున్నాంగనక మొలోతు నీళ్లలోనే బయట పడ్డాం. ఒరే రంగ! మనకు రోజులు కలిసొస్తే నీ మొహాన వుమ్మేసినవాళ్లే నీ మెళ్లో పూలదండ వేస్తారు. తెలిసిందా? సరిగ్గా నాకదే జరిగింది!' అన్నాడు కూనేశ్వరుడు కొంచెం కళ్లు పెద్దవి చేస్తూ.

'ఒరే కూనాయ్. నీకీ జన్మలోమంచిరోజులు వొచ్చినయ్యని నేను వింటం జరుగుతే నీకోసమన్నా తిరుపతి వెళ్లి జుట్టు తీయించుకొస్తా! ఈ వరద సందర్భంలో పొరపాటున నీకేమన్నా పెట్టెలు దొరక లేదుగదా?' అనడిగాడు రంగారావు, కూనేశ్వరుణ్ణి సందేహంగా చూస్తూ.

'ఛీ ఛీ! అంతఖర్మం పట్టలేదు! నాకు రెండులక్షలఎనభైవేల చిల్లర లాట్రీలో వచ్చింది!' అనేశాడు కూనేశ్వరుడు, నూటఎనభై డిగ్రీలమేర చూస్తున్న కళ్లతో.

'చంపేశావు!' అనో కేకపెట్టి కుర్చీకి అంటుకుపొయ్యాడు రంగారావు.

'మన ముఖ్యమంత్రి తన స్వహస్తంతో చెక్కు నా చేతికిచ్చాడు! ఆ చెక్కును బాంకీలో నా ఎక్కౌంటులో వేసుకున్నా!' అన్నాడు కూనేశ్వరుడు చిరునవ్వుతో.

కొన్ని క్షణాలపాటు కూనేశ్వరుణ్ణి నఖశిఖ పర్యంతం ఎక్సరే కళ్లతో ఎగాదిగాచూసి, ప్రస్తుతం జరిగిందంతా ఒక్కసారి నెమరేసుకుని, వరదహర్తలుతప్ప తను యితర విషయాలను పేపర్లలో అంతగా పట్టించుకోకపోయినా కూనాయ్ చెబుతున్నది అక్షరాలా నిజమై వుంటుందని నమ్మాడు రంగారావు. ఎందుకంటే అకస్మాత్తుగా చావు కబురు విన్నా, లాట్రీలో లక్షలొచ్చినయ్యని తెలిసినా ఏ మనిషయినా షాకు తింటంలో ఆశ్చర్యం లేదు! బహుశ కూనేశ్వరుడికి బాపట్లలో తగిలిన షాకు మద్రాసుదాకా వెంటాడినా ఆశ్చర్యపడ నవసరం లేదు.

'నువు నూరేళ్లు బతుకు! నీలాంటి అదృష్ట వంతుడు కొన్ని లక్షల మందిలో ఒక్కడే వుంటాడు! లాట్రీ ధనదేవత లక్షలమంది అభాగ్యుల్లో ఒకణ్ణే వరిస్తుంది! నీ దరిద్రం తీరినందుకు నిన్ను మన సారా అభినందిస్తున్నా!' అన్నాడు రంగారావు.

'నువు నన్నభినందిస్తున్నందుకు నాకెంతైనా సంతోషంగావుంది! కాని యింతటితో నా దరిద్రం నిజంగా తీరిందా అనే ప్రశ్న నన్ను వెంటాడి పీడిస్తున్నది. ఈ లాట్రీ నామనసదో రకంగా తయారైంది! నాలో ఏవో కొన్ని వింత అలజళ్లు బయల్దేరినై!' అన్నాడు కూనేశ్వరుడు, రంగారావు నదో రకంగా చూస్తూ.

'నీ మనసేదో రకంగా తయారవటం పరమ

సహజం! అందుకు నువేం కంగారు పడక్కర్లేదు! నీ స్థితి నేను తేలిగ్గా అర్థం చేసుకోగలను! జిహ్వా చాపల్యంతో మృత్యువాతనుపడి బతికినవాడు, ఎన్నో రుచిగల పదార్థాల్ని ఒకేసారి తినాలని కొట్టుకులాడ్తాడు. దరిద్రంతో చస్తున్న వాణ్ణి ధనదేవతొచ్చి ఆలింగనం చేసుకుంటే ఆ చస్తున్న వాడు నిఠారుగా లేచి కూచోటమే కాదు, వూహకందని నూతన శక్తులేవో వాడి నావహిస్తయ్! అంటే అట్లాంటి శక్తులేవో నీలో ఆవిర్భవించినై గనక అలజళ్లంటం సహజం!' అన్నాడు రంగారావు.

'సైకాలజీ గురించి కవిత్వ ధోరణిలో నువు చెప్పింది బాగానే వుంది! నాకు నిజంగా ఏ రేసుల్లోనో, లాట్రీల్లోనో రెండు మూడు లక్షలు తగుల్తే నేను చేయువలసిన పన్లను గురించి కొన్ని ఆలోచన లుండేవి! చిత్రమేమిటంటే తీరా నాకా అదృష్టం అబ్బేసరికి ఆ ఆలోచనల్లో ఒక్కటైనా నన్ను తాకటంలేదు!' అన్నాడు కూనేశ్వరుడు, రంగారావును వింతగా చూస్తూ.

'అవును, తాకకపోవచ్చు. మచ్చుకు వాటిలో ఒక్కఆలోచనయినా నాకు వినిపిస్తే నిన్ను కొంతైనా అర్థంచేసుకుంటా!' అన్నాడు రంగారావు.

'ఒరే రంగా, నీకన్న నా కాప్తమిత్రుడింకోడులేడు. దాపరికంలేకుండా ప్రస్తుతం నన్నొచ్చి అంటుకున్న ఆలోచనల్నిగురించి నీకు చెప్పేస్తా. ఏ రేసుల్లోనో, లాట్రీల్లోనో ఛాన్సు తగల్టంతప్ప నా జీవితాన్ని నా వుద్యోగంతో గట్టెక్కించగలననే ఆశ నాకేకోశానా లేకుండాపోయింది. దైవికంగా యిప్పుడు నాకా ఛాన్సు తగిలినమాట నిజమే. చేసిన అప్పులూ, నిలువునా వొల్చుకున్న నా భార్య తాలూకూ నగలూ, నేను బ్యాంకుడబ్బు తీసుకున్న సందర్భంలో నా మామ నన్నాదుకున్న తాలూకూ డబ్బూ మొత్తం ఎవర్ది వారికి వడ్డీతో సహా తీర్చివేసేద్దామనుకోటమేకాదు, ఎవరైనా అభాగ్యుల అవసరాలకు కొంతమొత్తాన్నిద్దామనుకున్నాకూడా; కాని యిప్పట్లో ఆ ఆలోచనలవల్ల అంత గట్టిప్రయోజనం వుండదని నాకు తోస్తున్నది. ఎందుకంటే నా జీవితానికో వెలుగుబాట ఏర్పడాలంటే యిప్పుడు నా చేతికొచ్చినధనం యింకోసారి లభ్యంకావటం కల్లోనిమాట! ఆ బాట ఏర్పడ్డానికి ఎంతో కాలవ్యవధికూడా అవసరంలేదని నాకు తెలుసు. అవి ఏర్పడిన మరుక్షణం నేను ఋణవిముక్తుణ్ణవటమేకాదు, పది కుటుంబాల్ని తేలిగ్గా పోషిస్తా! బహుశ నేనంటున్నది నీకిప్పట్లో అర్థంకాకపోవచ్చు' అన్నాడు కూనేశ్వరుడు గంభీరంగా చూస్తూ.

'ఇందులో అర్థంకానంత గూఢార్థాలేమున్నయిరా కూనాయ్! నీ చరిత్రకు బీజా లెక్కడేర్పడి ఎటుగా ప్రయాణిస్తున్నదీ నాకు కళ్లకు కట్టినట్టు తెలుస్తున్నది! మంచీ, చెడూ, నీతీ అనే మాటల విలువ నీకు పట్టింపువుంటే నీ ఆలోచన లింకోరకంగా వుంటయ్. జూదాలకూ, రేసులకూ నీ భార్య నగలన్నీ వొలిచేశావంటే నువు గోహత్యచేసినంత మహాపాపం చేశావు! బెంగుళూరు రేసుల్లో క్షవరంచేసిన బాంకిడబ్బు తీరా బాంకివాళ్లు పసిబట్టి నీ కుతిక పట్టుకునేసరికి, కాస్త గోప్యంగా బతుకుతున్న నీ మామ నందులోకి లాగి, నువు బయటపడి, ఆయన పరువు నుతికేసి దండారేశావు! ఒరే కూనాయ్! నలుగురిచేత నీఅంత మంచివాడు లేడనిపించుకునేందుకు చికిత్స చేయడానికి యిప్పుడు నీ చేతికోమాంచిమందు దొరికింది! ఈ సదవకాశాన్ని నువ్వీనాడే వుపయోగించుకో!' అన్నాడు రంగారావు.

'ఆ చికిత్స నువ్వూ నేనూ చేయకుండానే జరిగింది! నాకు లాట్రీలో రెండు లక్షల ఎనభై వేలొచ్చిందని వినీ వినటమే తడవుగా నన్ను తిట్టిన వాళ్లంతా మిడతలల్లే నా దగ్గరవాలి, విప్పారిన మొహాల్తో నన్నభినందించారు! నాకు పరిహారం లేదని రాసిపెట్టిన వాళ్లే ధనదేవతొచ్చి నావాళ్లో కూచోటం చూసేసరికి వెంటనే ఆ రాసింది వాళ్లే తుడిచేసుకున్నారు! ఒరే రంగా, యిది డబ్బు. ఎన్ని

అవినీతుల్ని పాపాల్నయినా యిట్టే హరించేస్తుంది! చేసిన సహస్ర పుణ్యాలను ఒక్క పాపకార్యం తుడిచేస్తుందనే వాక్కుకు యిది ప్రత్యామ్నాయ సిద్ధాంతం. అదే డబ్బు సిద్ధాంతమనే నిజాన్ని నేనెప్పుడో తెలుసుకున్నా అందుకే డబ్బార్జనకోసం నేనెన్నాయుధాల్నయినా ప్రయోగించా! రేపు ఎట్లా గడుస్తుందా అనే పీడా దృశ్యాలు ప్రత్యక్షమయ్యే నాకు, తెల్లవార్లేస్తే బాంకు వుద్యోగంలో వేలు, లక్షలు బొత్తులు గట్టి యింకోరికోసం భద్రపర్చటం నాకెంత బాధాకరంగా వుంటుందో నేనెవరికీ చెప్పలేను! ఒక్కో లక్షాధికారి మా బాంకులో అడుగుపెడ్తుంటే ఏజంటు దగ్గర్నుంచి మా ఎక్కౌంటెంటువరకూ ఎవరో తప్పినట్లు కూర్చీల్లోంచి లేచి దండాలు పెట్టటం నేను రోజూ చూస్తూంటా! కొందరు మా బాంకిలో వేలకొద్దీ అప్పులు తీసుకుని, మరదేం వ్యాపారాలు చేస్తారో ఏమో, వారం తిరక్కమునుపే యిట్టే ఆ అప్పులు తీర్చేసి, వేలు లాభాలు చేసుకోటం నాకెంత ఆశ్చర్యం వేసేదో! యింతకీ ఒక్కమాటలో నీకు క్లుప్తంగా చెప్పాలంటే, రోజూ వేలకొద్దీ పచ్చనోట్లు నన్ను తాకుతూ పక్కనబడి పోతయ్యేగాని నన్ను కన్నెత్తయినా చూడవే! అందుకే ఆ ధనదేవత నన్ను కటాక్షించి తీరాలనే నిశ్చయానికొచ్చా! చివరకది జరిగిందికూడా! ముందు జరగబొయ్యేదికూడా అంతే!' అన్నాడు కూనేశ్వరుడు.

'ఒరే కూనాయ్, నువు లక్ష చెప్పు. నీమతం అంటే డబ్బుకోసం నువు అవలంబించే పద్ధతుల్ని మటుకు నేను సమర్థించలేను' అన్నాడు రంగారావు.

'...అంటే నేను చచ్చీచావకుండా సంకెళ్లేసుకుని ఆ బాంకి వుద్యోగంలోనే నల్లి మాడినట్టు మాడమంటావా?' అనడిగాడు కూనేశ్వరుడు.

'అని నేనంటం లేదు. నిత్యావసరాలు తీరని కొన్ని లక్షలు, కోట్లమంది అభాగ్యులు మనదేశంలో వున్నారు. వాళ్ల స్థితి మెరుగుపడేందుకు పరిస్థితులు మారటం అవసరంకూడా. మనం వాచిపోయిన స్వాతంత్ర్యం మనదేశంపొందినాక వాళ్లస్థితి మెరుగైందని నేనంటంలేదు. కాని యీ అవసరాలు తీరనివాళ్లంతా అవినీతికీ జూదాలకీ పూనుకుంటే మనం ఎక్కడికి పోతున్నామనే నేనంటం' అన్నాడు రంగరావు.

'ఒరేయ్, నీ కాగితప్పని అవినీతీ, జూదా లనే మాటలకర్థం ఏమిటనడుగుతున్నా. ఆ మాటలు మనకామోదకరమైనవిగా మన ప్రభుత్వం, ప్రజలూ ఎప్పుడో ఒప్పుకున్నారు. నువింకా వాటిని పట్టుకు వెళ్లాట్టం నాకేమంత వివేకంగా తోచటం లేదు. మనదేశంలో తాగేందుకూ, జూదాలాడేందుకు, క్లబ్బులకూ, రేసులకూ, లాట్రీలకూ మన ప్రభుత్వం మంజూరు చేసిన లైసన్సులున్నయ్. లైసెన్సుకు లోబడిన పై అలవాట్లన్నీ నాకున్నయ్. అందుకు నువ్వు నన్ను తప్పుపట్టడం బొత్తిగా అర్థరహితమైందని నువ్వు ఒప్పుకోవటం మంచిది. నేను బి. ఏ. ఎకనమిక్సు ప్రెసిడెన్సీ ఫస్టున పాసైనాననే విషయం నీకు తెలిసిందే. నాకీ పిండాకూడు యోగ్యత ధనార్జనకు ప్రతిబంధకమని నాకామధ్యే కనువిప్పయింది. ఎందుకంటే ఏ యోగ్యతలో నిమిత్తంలేకుండా లక్షలు గడించేవాళ్ల సొమ్ము నేను భద్రంగా వాళ్లపేర కట్టలు కట్టేందుకే నా వుద్యోగం పరిమితమైందని తెలిసిన మరుక్షణం నా ఒంటినిండా చీమలు, జెర్రులు పాకుతున్నట్టనిపించింది! అందుకే నాకు పట్టుకున్నవ్యాధి నివారణకు రేసులూ లాట్రీలకు మించిన మందు లేదనిపించింది. ఇందాక నువ్వన్నావే డబ్బు మానవుడిలో నూతనశక్తుల్ని పుట్టిస్తుందని; ఆ శక్తుల్ని పరీక్షించేందుకే నేను మద్రాసు వచ్చింది!' అన్నాడు కూనేశ్వరుడు.

'ఒరే కూనేశ్వరుడూ! యిప్పుడు నేను నిన్ను పొంతం అర్థంచేసుకున్నా. నీ మేధస్సు గాడి తప్పిందంటంలో నాకేమాత్రం సందేహంలేదు.

బొంకుబొంకినకొద్దీ నిజమైనట్లు భ్రాంతి కలిగించినా బొంకుబొంకేననే నిజంతో పాపం నీకు నిమిత్తంలేదని నాకు తోస్తున్నది. ప్రతిబూతునూ, అవినీతినీ, హత్యల్నీ, కిరాతకచర్యల్నీ, హింసనూ, మంచినిచెడుగానూ, చెడును మంచిగానూ సమర్థించి నమ్మించేందుకు మన భాషల్లో వచ్చేన్ని మాటలూ, వాటిని పంపిణీచేసేందుకు తలవెంట్రుకలన్ని పత్రికలూ, వేదికలెక్కి గొంతులు చించుకునేందుకు సరిపడినన్ని ముఠాలూ మనకు కొల్లలుగా వున్నయ్. బౌద్ధులు, శైవులు, వైష్ణవులు ఒకరిగొంతువొకరు పిసికినా, హిందువులు, ముస్లిములు యివాళ నడివీధుల్లో హత్యలు చేసుకుంటున్నా ఎవరి చర్యలు వారికి సమర్థనీయంగానే వుంటయ్! అట్లాగే యీనాటి రాజకీయముఠాలు కూడా. ఒక ముఠావార్ని యింకో ముఠావారు ఎవర్నెవరు దుమ్మెత్తిపోసినా, కుతికలుకోసినా ఎవరి ప్రయోజనాల్ని వారు వెనకేసుకొని సమర్థించుకునేందుకు ఎన్నిమాటలు, ఎన్నిపత్రికల్ని ఖరాబు చేస్తారో మనం నిత్యం చూసే విషయమే. వేలమొత్తాల్తో జూదాలు నడిచే క్లబ్బులు, రేసులు, లాటరీలు, తాగుడువల్ల ప్రజాసౌకర్యాలు తీర్చేందుకు ప్రభుత్వానికి రాబడి వుంటుందని యెవరైనా కుతర్కంచేస్తే చేయవచ్చుగాని, ఆ చెత్తంతా మన హీనస్థితిని నిరూపించేందుకు మచ్చుతునకలుగా వుపయోగపడ్తయ్యనేదిమటుకు ఖాయం. నేననేదల్లా నీ భార్య నగలమ్మి, నీ మామను ముంచీ, బాంకు డబ్బపహరించీ, వాళ్లచేత వుమ్మేయించుకొనిమటుకు నీ వెలుగుబాటల సంగతి చూసుకోవద్దని. నాకు కాలేజీకి టైమైంది. నువు నాతోవచ్చి యేవన్నా తిని, తాగాలిస్తే యిక్కడికేవచ్చి గమ్మున పడుకో, సాయంత్రం నేనొచ్చేదాకా' అంటూనే లేచాడు రంగారావు.

'ఎక్కడికిరా నువు పోయేదీ—నువావిధంగా త్రిశంకుడిస్థితిలో వన్నాదిలేసి నీదార్న నువుపోతే నేను బాధ భరించలేను. దగ్గిరెక్కడైనా ఫోను వుంటే కాలేజీకి సెలవుచెప్పి, కొంచెం కాఫీటిఫిన్ లాంటివి ఏర్పాటుచేయిస్తే నీఅంతనీతిపరుడు యింకోడుండడు'—అన్నాడు కూనేశ్వరుడు.

ఆ మాటకొస్తే కూనేశ్వరుడి లోతు సొంతం చూడంది తెంచేసుకున్నట్లు తను కాలేజీకి వెళ్లటం రంగారావుకు అంత రుచించలేదు.

'సరే, యివాళ నువు వెనకటి కూనాయివి కాదాయె! లక్షాధికారివై పోతివేమరి! ధనదేవత విన్నేమి ఘనకార్యాలు చేయమంటుందో, నీ అలజళ్ల నైజమేమిటో ఆసొంతం తెలుసుకోంది నాకుమటుకు కాలాడ్తుందిట్రా కూనాయ్! కిందఇంటివాళ్లకు ఫోనుంది, ఆ చేత్తోనే వాళ్లబ్బాయి నెవర్నైన హోటలుకుపంపే ఏర్పాటుకూడా చూస్తా; నువీలోపు, అక్కడే తువాళ్లున్నయ్, ఆ స్నానాలగదిలో ఒళ్లు శుది చేసుకో' అని మెట్లుదిగి కిందికి వెళ్లాడు రంగారావు.

ఓ అరగంటలో కాఫీ, టిఫెన్లయివాక నసాళం అంటేట్టు సిగరెట్ దమ్ముపడ్తున్న కూనేశ్వరుడికి రంగారావెంతసేపటికీ కప్పులూ, ప్లేట్లు కడిగి సర్దటంనుంచి బయటపడకపోవటం కొంచెంవిచారం కలిగించి, కేకేశాడు 'ఒరే రంగా, నువా] తెలిసీతెలియని ఆడపన్లుచేయటం నేను చూళ్లేను! నువు ఎంత సర్దినా అవి వుండవలసిన తీరుగానే వుంటయిగానీ, యిటొచ్చి కూచో.'

'నీకేం లక్షాధికారివి! మా ఆవిడ క్యాంపుకు వెళ్లినా, ఆవిడ వాసన నన్నంటి పెట్టుకునే వుంటుంది! తను మళ్లీ ఇంటికి తిరిగి వచ్చేప్పటికి పెట్టిన వస్తువు పెట్టిన చోట వుండటమూ, ఇల్లు అద్దమల్లే క్లీనుగా వుండటమూ చూస్తే ఆవిడె ఆత్మ ఎంతానందిస్తుందో నీకేం తెలుసు!' చేతులు తుడుచుకుంటూ వొచ్చి కుర్చీలో కూచున్నాడు రంగారావు.

'ఒరే రంగా, నేనో గట్టి కార్యాన్ని సాధిద్దామనుకుంటున్నా!' అన్నాడు కూనేశ్వరుడు.

'గట్టి కార్యమా ఘనకార్యమా?' అడిగాడు రంగరావు.

'రెండింటికీ పనికొస్తుంది!' అన్నాడు కూనేశ్వరుడు.

'ఏమిటది?' అడిగాడు రంగారావు.

'నేనో సినిమా తీద్దామనుకుంటున్నా!' అన్నాడు కూనేశ్వరుడు రంగారావును పరిశీలిస్తూ.

'నువేదో నిజంగా ఘనకార్యం చేస్తావనే భ్రాంతి కలిగింది. ఒరే కూనాయ్, నీ మనసు బాగా పనేస్తున్నదా?' అడిగాడు రంగారావు.

'నిక్షేపంగా పనేస్తున్నది! ఏం సినిమా తీయటం ఘనకార్యం కాదంటావా? అసలు సినిమాలంటే నీకు గిట్టుతుందో లేదో ముందు చెప్పు' అడిగాడు కూనేశ్వరుడు.

'అది అందరూ చేస్తున్న పనేగదా, యిందులో ఘనతకు సంబంధించిం దేముంటుందా అని అన్నానేగాని నువ్వు మరోలా అనుకోబోకు' అన్నాడు రంగారావు.

'నీ ధోరణి బొత్తిగా నాకు నచ్చటం లేదు. వింతగాకూడా వుంది! నీ వాలకంచూస్తే సినిమాలంటే నీకేదో దొబ్బుడయిన్నట్టుంది! ఎందుకంటే సినిమా పేరెత్తినా, సినిమా మనుషుల్ని చూసినా ఎగిరి గంతేసే మనుషులు కొన్నివందలు, వేలమందిని నే నెరుగుదును! వాళ్ల అభిప్రాయాలు కాదంటావా ఏమిటి ఖర్మ!' అన్నాడు కూనేశ్వరుడు.

'అనే ఖర్మ నాకెందుకు! భలాని సినిమా బాగుందంటే బాగుందీ లేదంటేలేదని చెప్పడమే నా వంతు' అన్నాడు రంగారావు.

'రక్షించావు! అయితే సినిమా ప్రభావం నీకు బొత్తిగా తెలియదంటం సబబుగాదు. అన్నట్టు నీకు తెలిసిన కొందరు సినిమా మిత్రులున్నారని లోగడ నువు చెప్పినట్టుకూడా నాకు జ్ఞాపకం' అన్నాడు కూనేశ్వరుడు.

'నేనీ మద్రాసులో మన తెలుగు సినిమాలు చూసేందుకు వాళ్లే నాకాధారం. ఒక్కోసారి ఒక్కో మన తెలుగు సినిమాచూస్తే వచ్చే వికారం నివారణ చేసుకుంటానికి యింకో సినిమాచూసి చివరకు అదొక అలవాటుకింద చేసుకున్నా' అన్నాడు రంగరావు.

'అది నీ ఖర్మ! లక్షలమంది ప్రజలుచూసి ఆనందించే సినిమాలు నీకు నచ్చడం లేదంటే అది మీ కాలేజీ తత్వాలకుండే జబ్బేమోనని నా కనుమానంగా వుంది' అన్నాడు కూనేశ్వరుడు.

'కోప్పడకురా కూనాయ్! మా కాలేజీల తత్వం గురించి నీ అంచనా శుద్ధ తప్పు. కాలేజీ విద్యార్థులు సినిమా ప్రేక్షకజనం కారని నువెందుకు పొరబడ్డావో నాకాశ్చర్యంగా వుంది. వాళ్లు పాఠాల కన్న సినిమాల్ని గురించీ సినిమా స్టార్సు గురించి ఎంతాసక్తితో చదువుతారో నీ దృష్టికి పడకపోవటం వింతగానే వుంది!' అన్నాడు రంగరావు.

'నా దృష్టిన పడినా నాకాశ్చర్యం కలగదు. ఒరే రంగా, నా దగ్గరంటే అన్నావుగని, పొరపాట్నన్నా నువు సినిమాల్ని గురించి ఎద్దేవగా బయటెక్కడయినా అన్నావంటే మటుకు నీ తోలు వొలిచి నిన్ను ప్రజావ్యతిరేకిగా జమకట్టేందుకు మనుషులున్నారని నీకు చెప్పగలను! ఎందుకంటే యివాళ సినిమాలంటేవున్న గాఢమైన మోజుతోనే వాటిపై ప్రజలు కనకవర్షం కురిపిస్తున్నారనేది మటుకు ముమ్మాటికీ నిజం' అన్నాడు కూనేశ్వరుడు.

'పిండకూడూ బీరాకూడూ! నూటికి డెబ్బయ్ వంతులు సినిమాలు నష్టపడుతున్నయ్యని సినిమా రంగంలోని నా మిత్రులే అంటున్నారు. ప్రతిచెత్త సినిమాకూ చచ్చినా ప్రజలు డబ్బివ్వరని నువు తెలుసుకోటం మంచిది!' అన్నాడు రంగారావు.

'ఓరి పిచ్చినాయినా, ఆ విషయం నీకన్న

నాకు బాగా తెలుసు! వాళ్లకు నచ్చిన సినిమాల మీదే కనకవర్షం కురిపిస్తున్నారని నా వుద్దేశ్యంగా నువెందు కనుకోకూడదూ? ఒరే రంగా, సినిమా రంగం ఒక వ్యాపారరంగం. ఇతర వ్యాపారాల్లాగానే దీనికీ లాభనష్టాలు రెండూవుంటం సహజం. చివరకు సినిమా తీయటం ఒక లాట్రీ లాంటిదనో, రేసుల్లాంటిదనో, జూదమనో బుజావు చేయడానికి నువ్వు ప్రయత్నించవచ్చు; కాని నాకలాంటి మహిమల్ని గురించి మంచినీళ్ల ప్రాయంగా తెలుసు గనక నేనంత సులభంగా నీకు లొంగను! అయితే సినిమా వ్యాపారానికో ప్రత్యేకమైన రక్తమాంసాల్తో కూడిన మేలిమి రంగొకటి వుంది! ఆ మేలిమిరంగు తెరపై అడుగడుగునా కనుపిస్తూ ప్రేక్షక జనాన్ని యిట్టే పట్టేస్తుంది! సరైన మాట తట్టక నేను మేలిమిరం గంటున్నాను. నువు దాన్ని ఎట్లా సర్దుకున్నా నా కభ్యంతరం లేదు! అందుకే సినిమాలకు జనం ఎగబడ్తున్నారు! ఆ మనుషులకు వూరేగింపులు జరిపీ, హారతులిచ్చీ బ్రహ్మరథం పడ్తున్నారు! వూరూరా ఆ మనుషుల పేర సంఘాలున్నయ్యని నీకు ఎన్నయినా దాఖలాలు చూపిస్తా! సినిమాకున్న యీ ప్రత్యేక సౌందర్యమే--యీ సౌందర్యమనే మాటకూడా నేను అతికినట్టు వాడకపోతే నువు సరిచేసుకోవచ్చు - నన్ను బలంగా బంధించేసి, నా జీవితానికో పుణ్యం, పురుషార్థాలంటూ ప్రసాదిస్తుందనే గాఢవిశ్వాసం నాలో కలిగింది!' అన్నాడు కూనేశ్వరుడు ఆవేశంతో.

'శుభం! నీ అదృష్టరేఖల్ని చూసిన నేను నిన్నెందుకు కాదనాలి! నిన్నెంతమంది దుమ్మెత్తిపోసినా లాట్రీలో నీకు లక్షలురాకుండా ఆపగలిగారా మరి! అట్లాగే నువ్వు తలబెట్టబొయ్యే సినిమా వ్యాపారం నీకు ధన వస్తు వాహన కీర్తిపుణ్యాలనెందుకు ప్రసాదించకూడదు! ఈ సందర్భంలోనే నన్నో చిన్నధర్మసందేహంకూడా యింకా పీడిస్తూనే వుంది! నేనడిగిన ప్రశ్నకు నువు వెంటనే సమాధానం చెప్పాలి. అకస్మాత్తుగా నీకు లాట్రీలో రెండులక్షలఎనభైవేలు వచ్చేసరికిముందు నీకు అనిపించిందేమిటి?' అనడిగాడు రంగారావు.

'నా దరిద్రం తీరిందని!' అన్నాడు కూనేశ్వరుడు.

'యిప్పుడూ నీకట్లాగే అనిపిస్తున్నదా?' అడిగాడు రంగారావు.

'అంతకుమించి అనిపిస్తున్నది! ఒరే రంగా! నువుత్త పిచ్చినాయనవి! సందర్భాల్నిబట్టి తెలివితేటలనేవి కొన్నిగీతలమధ్యే గూడుకట్టుకునే స్వభావం గలవి! నీ తెలివితేటలు మీ కాలేజీలకుండే వాతావరణం గీతల్ని దాటిపోలేకపోవటం నీ తప్పుకాదు! అందువల్ల రోజూమారుతున్న యీ లోకానికి నువు పాతవాడివి! నీ పాతచూపుకు యీనాటి లోకం నీవెపుకన్నా తిరిగిచూడదు! నీవడిగిన ప్రశ్న వుద్దేశ్యాన్ని నేను గ్రహించలేదనుకోకు! నీకో చిన్న విషయం చెబుతా! డబ్బుకు అయస్కాంతశక్తి వుంది! యీ అయస్కాంతశక్తికి కొత్తడబ్బు నాకర్షించే స్వభావంకూడావుంది! డబ్బు ఖర్చవుతే దాని అయస్కాంతశక్తి దానంతటదే నశిస్తుందికూడా—అంటే నువు దాన్ని సద్వినియోగం చేయకపోతేనే అది సంభవిస్తుంది! ప్రస్తుతం నాకు లాట్రీలో వొచ్చిన డబ్బు నేను సద్వినియోగంచేస్తే అది నాకొక మూలశక్తిగా వుపకరిస్తుంది! అందుకే నీకు సినిమా రంగంలో తెలిసిన మిత్రులున్నారుగనుక వాళ్లను నాకు పరిచయం చేయమనడుగుతున్నా. అందులో పనికివచ్చేవార్ని ఎన్నుకోవడం నా వంతు. మన పత్రికల ధర్మమాఅని సినిమా వ్యక్తుల పుట్టుపూర్వోత్తరాల్ని గురించిన విషయ సామగ్రిని నేనెప్పుడో చదివి జీర్ణించుకున్నా! యిహ నువు నన్ను కాదనటానికి వీల్లేదు' అని రంగారావు రెండు చేతులూ పట్టుకున్నాడు కూనేశ్వరుడు.

* * *

తను కల్లోకూడా అనుకుంటానికి వీల్లేని

బదిలీ అయింది రంగారావుకు మద్రాసునుండి. మద్రాసులో ఏ తెగకు చెందినవారైనా ఎవరి మానాన వారు గోప్యంగా బతకొచ్చనే అభిప్రాయం రంగారావు కేనాడో కలిగింది. ఏ పొరుగింటివారో త్నూ ఎవరికీ సంబంధాలుండవు, కావాలని పూసుకుంటేతప్ప. ఇక్కడి యే రాజకీయముఠాలవాళ్లూ నడిబజార్లల్లో ఒకరి గుడ్డల్నింకొకరు చింపుకొని దుమ్మెత్తిపోసుకోటం ఏనాడూ రంగారావుకు చూసినట్టు జ్ఞాపకంలేదు. విశ్వప్రయత్నంమీద ఏణ్ణర్థం దాటినాకగాని తన వుద్యోగాన్ని మళ్లీ మద్రాసుకు మార్పించుకోలేకపొయ్యాడు రంగారావు.

తను బదిలీఅయి మద్రాసునుండి వెళ్లే ముందే కూనేశ్వరుణ్ణి సినిమారంగంలో తన మిత్రులకు పరిచయంచేసివెళ్లాడు రంగారావు. ఆ పరిచయంచేసిన నాలుగోరోజుకే కూనాయ్ తనకు కనుపించి సినిమా వాతావరణంలో తను కొత్తగా కనిబెట్టిన విశేషాలూ, టాప్‌స్టార్సుతో తను ఎంత పూసుకుతిరుగుతున్నదీ తనకు చెప్పవలసిన పద్ధతిలో చెప్పేసివెళ్లాడు. ఈ ఏణ్ణర్థంలో తను బదిలీ అయినప్రాంతానికి వాణ్ణుంచి రెండే వుత్తరాలు తనకొచ్చినై; అదీ తను వెళ్లిన మూడునెలలలోపే. తరువాత కూనాయి విషయం తనకు తెలియలేదు. ఆ రెండో వుత్తరంలో వాడు తన 'లోకేశ్వర్ ప్రొడక్షన్స్'అనేపేర ప్రముఖస్టార్సును బుక్‌చేసి అతి త్వరలోనే షూటింగు ప్రారంభిస్తున్నాననీ తనను యిప్పుడందరూ 'లోకేశ్వర్'అని పిలుస్తున్నారనీ రాశాడు. తనో ప్రముఖవ్యక్తి నౌతున్నానని సూచించేందుకే కూనాయావుత్తరం రాశాడని రంగారావు మనసులో ఎక్కడో ఎందుకో కొద్దిగా తాకినట్టనిపించింది.

మద్రాసు వచ్చిన రెండోరోజునే టెలిఫోన్ డైరెక్టరీలో 'లోకేశ్వర్ ప్రొడక్షన్స్'పేరు ఎంత గాలించినా దొరక్క, లోగడ కూనాయి తనకు రాసిన ఎడ్రసు కో లోకల్‌వుత్తరమున్మెక్క తను మద్రాసు వచ్చినట్టూ, అదృష్టవశాత్తు ముందు తన ఖాళీ చేసిన ఇంట్లోనే తను మళ్లీ చేరినట్టు రాసి పడేశాడు రంగారావు. తను కాస్త స్తిమితపడేలోపు తన వుత్తరంఅందిన కూనాయ్ తన్నొచ్చికలవగలడనుకున్న రంగారావుకు ఆశాభంగం కలిగింది. అయితే ఒక రోజు తను పాండీబజారు గీతాకేఫ్ దగ్గర వున్నప్పుడు దైవికంగా తన ముందుగా కూనాయ్ కార్లో పోతుంటంచూసి చెయివూపాడు రంగారావు. కాని కూనాయ్ వెళుతున్నకారు ఆగకుండా వెళ్లిపోయింది. తనను కూనాయ్ చూసివుంటాడు అనే సందేహంలోపడ్డ రంగారావుకు బహుశ సినిమా అంతస్తుల్లో వుంటున్న కూనాయికి ప్రస్తుతం తనతో అంత అవసరం వుండకపోవచ్చుననే భావం కూడా కలక్కపోలేదు. కాని తను చూసిన ఆ కార్లో మనిషి నిజంగా కూనాయేనా అనే స్వల్ప సందేహంకూడా పీడిస్తున్నదే మరి! ఆ మనిషి కూనాయల్లేవున్న సినిమా వేషగాడల్లే వున్నాడు! ఏమైనా అనుకున్నంత తేలిగ్గా రంగారావుకు కూనేశ్వరుడు కనుపించలేదు.

ఆ నాడు సాయంత్రం రంగారావు తీరుబడి చేసుకొని భార్య పంకజం, యిద్దరు పిల్లలతో మెరీనా బీచ్‌కి వెళ్లాడు. పిల్లలిద్దరూ సముద్రపు అలలకు కొట్టుకొచ్చిన వింత వింత గవ్వల్ని కుతి తీరినన్ని వేటాడి, తడియిసకతో పిచ్చికగూళ్లు కట్టుకుంటున్నారు. తన పక్కనే కూచుని ఆడ కబుర్లు చెబుతున్న పంకజం ఎవరో గుంజినట్టు పదిబారల దూరంలో తెలిసిన యిద్దరు పెద్ద ఇళ్ల ఆడమనుషుల దగ్గరకెళ్లి వాళ్లతో యిచ్చకాలాడుతుంటం అసంతృప్తితో ఆమోదించిన రంగారావు ఎత్తుగా సంధ్య కాంతుల్లో ఎగరెగిరి పడుతున్న నీలాల తెల్లటి సముద్రం అలల వైపుకు మెల్లిగా తనదృష్టి మళ్లించాడు.

టక్కీమని ఓ పెద్ద అల విరుచుకు పడిందో లేదో—వులిక్కిపడి తల ఎత్తి చూచిన రంగా

రావుకు తన ఎదురుగా కూనేశ్వరుడు ప్రత్యక్షమైనాడు. తను కార్లో చూసిన మనిషి యీ కూనాయేనని చప్పున అనుకున్నాడు రంగారావు.

గడ్డందాకా గొంతుకూ వొంటికీ బిగిసిన ఎర్రపొట్టిచేతులనైలాను బనీనూ, కాళ్లకు అంటకుట్టిన టెర్లిన్ పాంటూ, నల్లద్దాల తెల్లఫ్రేము గాగిల్సూ, పెన్సిల్తో గీసిపెట్టుకున్న మీసాలు, కత్తిరించిన అంగుళం చిరుగడ్డం, బ్లాక్ అండ్ వైట్ సిగిరెట్టు డబ్బా, సిగర్ లైటుతో సినిమానటుడల్లే నిలువునా కనిపించిన కూనేశ్వరుణ్ణి ఒక్కక్షణం కనురెప్పలాడిస్తూ చూసిన రంగారావు 'ఏరోయ్ కూనా— లోకేశ్వర్! అనుకోకుండా యిలా దర్శన మిచ్చావేమిటి!' అని సహంలోనే మాట సవరించుకున్న రంగారావు, కూనేశ్వరుడికి కొంచెం వెనకనే సినిమా స్టార్లల్లే వున్న యిద్దరూ ఆడా, ఒక మొగ మనిషినికూడా గమనించాడు.

కొంచెందూరంలోనే తెలిసిన యిద్దరు ఆడ మనుషులతో మాట్లాడుతున్న రంగారావుభార్య పంకజానికి తనభర్తను నలుగురు సినిమాస్టార్లు చుట్టుముట్టడం కంటబడింది. ఆ క్షణంనుంచీ ఒక కన్ను యిటు ఆడమిత్రులకూ, యింకో కన్ను అటు తన భర్తను చుట్టుముట్టిన సినిమా మనుషులవైపూ విభజించి సతమత మవుతున్న పంకజం, యింకో అరగంటకు తన భర్త సినిమా వ్యక్తుల్నుండి విడుదలకావటం కనిబెట్టి, మిత్రులకు సెలవిప్పించి అరనిమిషంలో రంగారావు దగ్గర కొచ్చి వాలింది.

'ఎవరండీ ఆ మనుషులూ?' మరుక్షణం లోనే అడిగింది పంకజం రంగారావును ఆనుకొని కూచుంటూ.

'నువు నన్ను వొదిలేసివెళ్లకపోతే నీకేబాధా వుండేదికాదుగదా!' అన్నాడు రంగారావు, పంకజాన్ని మోచేత్తో చిన్నగా పొడుస్తూ.

'అబ్బ వుండండి- యిక్కడి జనం కళ్లన్నీ వాళ్లమీదే వున్నయ్, కొంపదీసి వాళ్లు సినిమా స్టార్లుకాదుగదా?' అడిగింది పంకజం.

'ఇంకోరి కళ్లేమిటి ఖర్మ, నీ కళ్లని వొప్పుకోరాదూ?' అన్నాడు రంగారావు.

'నాకంత ఖర్మేంపట్టలా! ఆ సినిమా వాళ్లను ఎవరైనా యిట్టే పసిబడ్తారు, నాకన్న వెయ్యిరెట్లెక్కువగా! యిహ చెప్పండి వాళ్లెవరో' అన్నది పంకజం.

'అందుట్లో ఎర్రబనీను మనిషి మన కూనాయ్! మిగతా ముగ్గురూ వాడి సినిమా మిత్రులు' అన్నాడు రంగారావు.

'ఎవరు—మీ స్నేహితుడు కూనేశ్వర్రావా! ఎంతవిచిత్రం! నేను చచ్చినా ఆయిన్ని పోల్చుకోలేదు! యిప్పుడాయన పేరు లోకేశ్వర్ కాదుటండీ?' అన్నది పంకజం

'భగవంతుడు నీకెంత జ్ఞాపకశక్తిచ్చాడువా! వాడెప్పుడో రాసిన వుత్తరంలోని ఆ విషయం నాకు జ్ఞాపకంచావక వాణ్ణి 'కూనాయ్' అనబోయి సహంలోనే నాలుక కొరుక్కున్నా' అన్నాడు రంగారావు.

'యింకా నయం! అంతపనీ మీరు చేసుంటే ఆయనెంత బాధపడుండేవాడో పాపం!' అన్నది పంకజం.

'పాపం వాడి సంగతేమోగాని ముందు ప్రత్యక్షంగా నీ బాధమటుకు చూశా!' అన్నాడు రంగారావు.

'మరీ చిత్రమండీ మీది! 'కూనాయ్' అని ఆ నోరు సాగదీసి అనుంటే మీకే తెలిసేది!' అన్నది పంకజం రంగారావును చిన్నతోపుతోస్తూ.

'ఒప్పుకున్నా! ముమ్మాటికి నీ మాట ఒప్పుకొని తీరాకూడా!' అన్నాడు రంగారావు పంకజం పాదం నొక్కుతూ.

'అవునండీ, ఆయన లాట్రీలో వచ్చిన డబ్బుతో సినిమాలు తీస్తున్నాడన్నారు, యిప్పటి

కేమేం తీసి ఎంత డబ్బు గడించాడో మీకేమన్నా చెప్పాడా?' అడిగింది పంకజం.

'వాడు మొదట ప్రారంభించిన చిత్రమే సహంలో వుందనీ, యిప్పటికి ఏడున్నర లక్షల ఖర్చయిందనీ అంటాడు' అన్నాడు రంగారావు.

'అమ్మ బాబోయ్! సహానికే అన్నిలక్షల ఖర్చే! లాటరీలో వచ్చింది రెండు లక్షల ఎనభై వేలయిలే, ఆయనకంత డబ్బెక్కడ్దండీ?' అడిగింది పంకజం.

'అదేమో నాకు తెలియదు; కూనాయి చెప్పిన మాటలే నేనంటున్నా. యిప్పుడు వాడితో వచ్చిన యింకొకతను కోటీశ్వరుడట. ఆయనతో భాగస్వామిగా యింకో చిత్రంకూడా మొదలు పెట్టాట్ట' అన్నాడు రంగారావు.

'ఇదేం ఖర్మండీ బాబాయనకూ! ఆ సహంలో వున్నదాన్ని ముందు పూర్తిచేసుకుంటే ఆ పెట్టిన డబ్బు రాబట్టుకోవచ్చుగా? అప్పుడే రెండో చిత్రం కూడా దేనికండీ? అసలింతడబ్బు ఎక్కణ్ణుంచి వాస్తున్నదో బాబాయనకు?' అనడిగింది పంకజం.

'అసలు నువడుగుతున్న ప్రశ్నలన్నీ నేను అడక్కముందే కూనాయ్ స్థితేమిటో కొంత నేనర్థం చేసుకున్నా. ప్రస్తుతం వాడు నడిసముద్రంలో వున్నా, నేనేమాత్రం పసికట్టకూడదని వాడి వుద్దేశ్యం! నేనో యాభైవేలు వాడికి సర్దుతే రెండు వారాల్లో తన చిత్రాన్ని పూర్తిచేసి పెద్ద రేటువడ్డీతో నా అప్పు నాకు నెల తిరక్కముందే తీర్చేస్తానంటాడు!' అన్నాడు రంగారావు.

'ఏమిటీ! ఏభైవేలేమిటీ, మీరు సర్దట మేమిటి? ఆ మనిషికేమైనా మతిపోయిందా ఏమిటి! పాపం, మీ కాలేజీ ప్రొఫెసర్లు ఆయన కంటికి లక్షాధికార్లల్లే కనుపిస్తారా ఏమిటి ఖర్మ! ఆ మాటకొస్తే పట్టున పదివేలన్నా మనదగ్గిర పుట్టవే!' అన్నది పంకజం.

'అంతకూడాలేదు — చివరకు, అయిదువేలన్నా ప్రస్తుతానికి చూడమన్నాడు. ముందు వాడడిగిన యాభైవేలు నేనుగాని, యింకెక్కడైనాగాని యిప్పిస్తే ఆ కోటీశ్వరుడిచేత నోటు రాయించి యిప్పిస్తానన్నాడు' అన్నాడు రంగారావు.

'అదేమిటండీ మరీ వింతగావుందీ! ఆ కోటీశ్వరుడికి నోటురాసియిచ్చే ఖర్మేం పట్టిందండీ, పుష్కళంగా వున్నవాడాయనుమరి?' అన్నది పంకజం.

'ఆయనకు అవసరానికి అందలేదంటాడు! నా మానాన నేను గోప్యంగా బతుకుతున్నవాణ్ణి నన్నభాసు చేయవద్దనిచెప్పా. సహంచిత్రం తనకు ఏడున్నర లక్షలు ఖర్చయిందనిఅన్న నోటితోనే నేను యాభైవేలు యిప్పిస్తే రెండు వారాల్లో మిగతా చిత్రం పూర్తిచేస్తానని వాడనగలగటమే నాకు మరీ ఆశ్చర్యం కలిగించింది! అందుకే కూనాయ్ నడిసముద్రంలోపడ్డ మనిషల్లే కనుపించాడని చెప్పింది!' అన్నాడు రంగారావు.

'నిక్షేపంగా చేతికొచ్చిన రెండులక్షలఎనభైవేలు ఎన్నేళ్ళుతింటే తరిగేను! పాపం ఆయన భార్యాబిడ్డ లెట్లా వున్నారో!' అన్నది పంకజం నిట్టూరుస్తూ.

'అదే నేనూ ఆలోచిస్తున్నా. కాని ఆ సహంలో వున్న చిత్రాన్ని పూర్తిచేసి కూనాయ్ కుబేరుడు కాడని నువ్వూ నేను ఎట్లా చెప్పగలం? ఇదిగో పంకజం, పిల్లలింకా అక్కడే వున్నారు పిల్చుకురా. ఇంటికి వెళ్దాం' అన్నాడు రంగారావు, చీకట్లో ఎత్తుగా తెల్లనురుగులో పడుతున్న సముద్రం అలలవైపు చూస్తూ.

---